పెద్ద కథ :

# రామారావు చెప్పని కథ

## (చైతన్య స్రవంతిలో రచన)

శ్రీ పి. యస్. శాస్త్రి

### ప్రస్తావన

రామారావు ప్రత్యేకంగా చెప్పుకోవలసినంత వ్యక్తేం కాదు. ఆంధ్రప్రదేశంలో వుంటున్న నాలుగున్నర లక్షల మామూలు యన్ జీ వోలలోనూ అతనూ వొకడు. రచయితలకుండే యక్సరే కళ్లతో అతని వొకరోజు దినచర్యను, ఆలోచనలను, (అంటే ఉదయం నిద్ర లేచినప్పటినుండి రాత్రి పడుకునేవరకూ) చదివేస్తే తయారైన కథ యిది! మనిషి ఆలోచనలను, ఆచరణలను, తీర్చి దిద్దే శక్తులను; వాటి ప్రభావాలను పరిశీలించటమే యిందులో ముఖ్యోద్దేశం! క్లిష్టమైన, విశ్లేషణల కతీతమైన, ఆలోచనల జోలికి పోకుండా సాగే యీ రచనల రామారావు తప్ప మరో వ్యక్తి మీతో మాట్లాడడు! రామారావు ఆలోచనలు మాత్రం భూత, భవిష్యత్, వర్తమానాల్లో విహరిస్తూ వుంటాయి!

...'కౌసల్యా సుప్రజారామా' శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం రేడియోలో గట్టిగా వినిపిస్తోంది! ...ఈ ధ్వనికి యింక మనం లేవక తప్పదు! హా! సుప్రభాతంట సుప్రభాతం! చలికాలం ఉదయం ఆరూ పదిహేనులకు లేపటం సుప్రభాతం కాదు! దుష్ప్రభాతం! ౼ సుప్రభాతం అన్న పదం ఆ వేంకటేశ్వర స్వామికే చెల్లింది! పెట్టిపుట్టిన మహానుభావుడు! హాయిగా రాత్రి అయ్యేసరికి వెళ్లి వైకుంఠంలో శయనిస్తాడు! ప్రొద్దున్నే ఎందరు ఎన్ని మైకుల్లో చెవులు చిల్లులు పడేలా గొంతు చించుకుని అరిచినా వినిపించదు! వీళ్ల సుప్రభాతాలు అన్నీ అయిపోయాక తీరిగ్గా తిరుపతికి దిగివస్తాడు...

...మనం వెంకటేశ్వరస్వామివీ కాదు, ఇది తిరుపతీ కాదు! కనక మనం రేడియోలో సుప్రభాతం వినగానే చచ్చినట్టు లేవవలిసిందే! మంచం దిగవలిసిందే!'...

...'దిగవయ్యా బాబూ! ముందు మంచం దిగు! తర్వాత డాక్టరేట్ ప్రదానానికి పనికివచ్చే యిల్లాంటి విషయాలు ఆలోచించవచ్చు!' అబ్బబ్బ! 'ఊ 'నాలోపలి' వాడొకడు! ఏదీ తీరిగ్గా ఆలోచించుకో నివ్వడు! ఇంకోక్షణం కూడా నన్నుపడుకో నివ్వడు!...నివ్వడు పడుకో!...

...'నడు రామారావూ! వెళ్లి ఆటూత్‌పేస్టు వెదుక్కో! నీకు వాడింకమాట తోచనివ్వడు!! ఓహో ఈయనెవరు? సినిమాలో చూపించినట్టు మనకి రెండు మూడు ఆత్మ ప్రతిబింబాలున్నట్లున్నాయి! శహభాష్! బ్రహ్మాండమైన మదీయ మదిలోని డ్రామా!...ఒహో! ఆహా!...

ఎక్కడెక్కడ? ఎక్కడ నా టూత్‌పేస్టు? ఇదిగో! ఇదిగో! ఇదిగిదిగో యీ మూలుంది!...

...హమ్మ! అద్భుతమైన విజయం సాధించాం! టూత్‌పేస్టును దానితో బ్రష్షును అతి

తొందరలోనే కనుగొన్నాం! అరె! అరెరే! టూత్ పేస్టు అయిపోవస్తున్నటుందే! వస్తూ అయిపోతోంది! అయిపోవస్తోంది! ... మళ్లీ మదీయదంత భద్రతకై...భద్ర దంతములకై టూత్‌పేస్టు కొనవలె! కొనవలె!...ఏది ఏది ఏది? కాల్గేటా ఫర్‌హాన్సా, సిగ్నలా? ఉహూ కాదు! కాదు! ఆమధ్య బినాకాలో పాటలు వినలా?...లా?...నలా?.. ....

'ఓరీ రామారావూ! పాపము నీ చిన్నతనము నుండియు వాడు బుధవారము 'బినాకా గీత్‌మాలా' వేసి 'మా బినాకా టూత్‌పేస్టు కొనండి' అని బతిమాల లేదా? ఎన్ని సంవత్సరములు పాటలు విన్నను ఒక్కసారైనను కొనకపోతివిగదా! కృతఘ్నా! నేడైనను కొనుము!'...

...ఓహో! నీతిగా రుద్బోధించు చున్నారు. 'సరే సార్! మీ మాట కాదనగలనా? అన్నచో తమరు నన్నాదరగొట్టక నూరుకొందురా?'...... అవును!...

...బినాకా పాటలు! పాటలు! బినాకా! అవునవును! నాకూ వెంకట్రావుకూ బినాకారోజు అంటే బుధవారం వొస్తే పండుగ! ఇద్దరి యిళ్లల్లో రేడియోలు లేకపోయినా పరంధామయ్యగారి రేడియో దగ్గర రాత్రి 8 గంటలనుండి 9 గంటలవరకు భైఠాయించడం క్రమం తప్పని కార్యక్రమం!...

...'అబ్బ! ఈ పాట మళ్లీ వచ్చింది.' 'క్రిందటి సారికంటె యీ పాట క్రిందకు దిగిపోయింది!' 'నోట్ చెయ్! నోట్‌చెయ్! క్రొత్తపాట యిది!' 'ఒహో! మళ్లీ ఈ పాటే హిట్ సాంగ్!' 'అవునవును! ముఖేష్ పాడితే హిట్టవక ఛస్తుందా.'

...ఎన్నెన్ని డైలాగులు! ఎంత ఉత్సాహం! ఎంత శ్రద్ధ!

...ఇంతకీ ఆ రికార్డ్లని సెలక్టు చేయటంలో కిటుకు ప్రమదావనం జవాబుల్లో మాలతీచందూర్ చెప్పేవరకూ మాకూ తెలీదు కద! తెలీదు! తెలీదు! తెలీదు!...

...హ! హ! హ! వెర్రి వెధవ భాస్కరరావు గాడు! అతివెర్రివెధవ రామారావుగా...ఛఛ! భాస్కర రావుగాడు!...

...నేనూ వెంకట్రావూ పాటల వరస నోట్ చేసుకొచ్చి కాలేజీలో మాట్లాడుకుంటున్నామని ఏడుపు! తన గ్లామర్ తగ్గిపోయిందని గుసుపు! పొట్టి జుట్టు పొడుగు ముక్కు భాస్కరరావుగాడు! వెధవ! ఇప్పుడు కాల్గేట్ కంపెనీలో రిప్రెజంటేటివ్‌గా పనిచేస్తూ యేడు వందలు 'డ్రా' చేస్తున్నాట్ట! ఏడవలేకపోయాడు. నన్ను చూసి కంపెనీ కారులోంచి స్టైలుగా చెయ్యూపాడు! వెకిలినవ్వు మకిలి పట్టిన పళ్లలోంచి నవ్వాడు!...

...ఆ! ఆ! వేరే వేరే వెర్రి ఆలోచనల్లో పడి పోతున్నా...అవును! ఆ వెధవ భాస్కరరావుగాడు! మళ్లీ మరచిపోయా!...ఔన్లే పెద్దాడి నవుతున్నానా! ఔను, చెంబుతో నీళ్లు తెమ్మందామంటే పెద్దాడు కనిపించి చావడేం?...ఏమయ్యాడు?

...హహహ! అరే పైకి నవ్వేశానా?...దొడ్లో వున్న భార్యామణి శ్రీమతి మణీ రామారావ్, ఎడిటర్ 'నారీలోకం' వింటే కష్టం! 'రాత్రి యీయనకు ఏగాలీ సోకలేదుకదా' అనుకుంటుంది! అసలే ఆవిడచేతిలో చీపురు కట్టకూడా వుంది! జాగ్రత్త రోయ్ రామారావ్! జాగ్రత్త......

మళ్లీ సైడ్‌ట్రాక్! అనగా ప్రక్కదారి! ఆ అదే! అదీ! ఆ భాస్కరరావుగాడు మహాపోజుగా మా ఫ్రెండ్స్‌మధ్య కొచ్చి 'నిన్నరాత్రి బినాకావిన్నారా? నిన్నటి హిట్‌సాంగ్ బ్రహ్మాండంగావుంది! ఓ. పి. నయ్యర్ మ్యూజిక్ అంటే మజాకానా?' అంటూ ఆరోజు వేసిన మొదటిపాట చెప్పాడు!

...వెర్రివెధవ! పూర్‌పూర్‌ఫెలో! ఫస్టొచ్చిన హిట్‌సాంగ్‌ని బినాకాలో లాస్టులో వేస్తారని కూడా తెలీదు! హాహాహ!

...అబ్బబ్బ ... వెధవనవ్వు! ఒద్దన్న కొద్దీ వొస్తోంది! శారదామణి అటుకేసి తిరిగివుంది కనక

సరిపోయింది. కాని తిరిగివుంటే చీపురు తిరగేసేదే! థాంక్‌గాడ్!

...మనం యింక దంతధావనం కానిద్దాం! ఓహో! బ్రష్షుకూడా కొత్తది కొనాలి! బినాకా, మెక్లీన్స్, కాల్గేట్, ఏది, ఏది, ఏది కొనవేది కొనను? కాల్గేట్‌ను కొందాం రంగులు బాగుంటాయి. పైగా పేస్టుకూ బ్రష్‌కూ డిఫరెంటు కాంబినేషను! ఓహో!...బావుంది...

అయితే కాల్గేట్‌లో హార్డా, మీడియమా, సాఫ్టా ఏదికొనను?...హార్డు చాలరోజులే వస్తుంది కాని యిగుళ్లకు యిక్కట్లు హెచ్చు! రక్తస్రావం జరుగుతుంది!.. ఛ! ఛ! ప్రొద్దున్నే యిదేంమాట గర్భస్రావంలాగ! పోనీ సాఫ్ట్‌కొందాం!... 'ఉహూ! మరీ నెలరోజులకే పోతుంది! ఏం చెయ్యనేం చెయ్యను? 'వయా మీడియాగా 'మీడియం' కొందాం!... అంతే అంతే!......

...'మిడిల్ క్లాస్ రామారావు మీడియం బ్రష్ కొంటాడు!' ఓహో! ఏం తీర్పండీ! మధ్యతరగతికి మధ్యతరగతికీ మధ్యనే సయోధ్య! అవునవును! అలాగే కుదురుతుంది కుదరక ఛస్తుందా? అమ్మమ్మ చెప్పలా, 'సమాన వియ్యము కయ్యము నెయ్యము' అని?...

...హమ్మయ్య! సో ఫార్ సో గుడ్! ఇప్పటికి రెండు ముఖ్య నిర్ణయాలు చెయ్యకలిగాం!... వెధవ స్టైలా నేనూను!...ముఖ్యనిర్ణయాలుట, పెద్ద గవర్నమెంట్ ఆఫ్ ఇండియావారి 'పాలసీ' నిర్ణయాల్లా! ఆఫ్టరాల్ రోజూ మొహం కడుక్కోవడాని కుపయోగించే టూత్‌పేస్టు, బ్రష్షు ఎంచుకోవడాని క్కూడా యింత రభసా? ..'అబ్బే' రభస కాదు! 'ఎంత చెట్టు కంతగాలి' అని చిన్నప్పుడు చదువుకోలా? 'చిన్న మాష్టార్ని' గుర్తుచేసుకో నేస్తం' ఇలాంటి వాక్యాలెన్ని కాపీ రాయలేమ? కాపీ. కాపీ...కాఫీ!... కాఫీ!......

'ఓయ్ శారదామణీ! నీ ప్రాణేశునకు కొంచెం కాఫీ పంపించుము! అర్జంటు!'......

...అరెరె! వెధవకుర్చీ! కూర్చునేసరికి గుడ్డ చినిగిపోయింది! రామరామ! మళ్లీ యిదొకటి కొనాలా? కరువులో అధికమాసం! అధికమాసమా? అవునూ... ఆ సామెత ఎలా వచ్చిందబ్బా? ఏడాదికి మాసాలు పన్నెండేకదా?...మరి అధికమాసం ఎలా వస్తుంది?... కరువురోజుల్లోనూ యేడాదికి మాసాలు పన్నెండు, రోజులు మూడువందల అరవై అయిదు! లీపు సంవత్సరంలో కాబోలు మారతాయి! అంతేకాని అధికంగా మాసం...నో నో! ఇదేం అర్థమయి చావటంలేదు 'సాటి సామెతల' పుస్తకంలోనో, 'సామెతల సంగ్రహం' లోనో వివరాలు చూడాలి! ఇంతకీ ఆ సామెత అర్థం... అర్థం...ఏదయితే నాకేం లెద్దూ!...ఓ అర్థ రూపాయి పెట్టి కుటిస్తే హాయిగా యింకో అర్థ సంవత్సరం వాడుకోవచ్చు!...అబ్బో! అప్పుడే ఎన్ని 'అర్థా'లు వాడాను! ..

'అర్థ అభావమున కదా యిన్ని అనర్థములు!' ఓహో!...చిన్నయసూరిగారి ఫక్కీలోకి వెళ్లినట్టున్నాం! చిన్నయ నన్నయ, చక్కటి రైమ్! 'నన్నయనుండి చిన్నయవరకూ సాగిన ఆంధ్ర సాహిత్య...' ఏదో వుండాలి! గుర్తొచ్చి చావటంలేదు!...లేదే చచ్చి వచ్చి... ఏమో!...

...ఇలాంటిదే ఇంకోటి వుండాలే! అవునవును!... గుర్తొచ్చింది!...'కారన్‌వాలీసునుండి కళా వెంకటరావు వరకూ...' ఏంచేసారబ్బా వాళ్లు?...ఆ! జమీందారీలు ఏర్పాటు చేయించింది వొకాయనైతే రద్దు చేయించింది మరొకాయన! బ్యూటిఫుల్! ఈ రెండు పనులవల్ల మనకేం కష్టంలేదు! నష్టంలేదు! 'ఫ్యుయ్ ఆర్ నో బెటర్ నో వర్స్!'

...పాపం! పూర్ జమీందార్స్!...ఛ! వెధవ ప్రయోగం! జమీందార్ పూర్ ఎలా అవుతాడు? పూర్ అయితే జమీందార్ ఎలా అవుతాడు? కాదయ్యా కాదు! 'ఎందుకు కాదోయ్ నేస్తం? కాస్త మన రంగబాబుని గుర్తు తెచ్చుకో!' ఓహో! లోలోనివాడు విషయాలు సరఫరా చేస్తున్నాడు...!...

...ఔనౌను! వాణ్ణెప్పుడూ పేరయ్య మేష్టారు 'పప్పు జమీందారూ!' అని పిలిచేవాడు. వాళ్ల నాన్న వున్న 'జమీ' నంతటినీ పేకాట గుఱ్ఱప్పందాల్లో హారతి పట్టేశాట్ట! కనుక...ఒకానొక సమయమందున జమీందారులును పూర్‌గానే వుందురు!

...ఇదేమిటి! మళ్లీ చిన్నయసూరి వొచ్చి పడ్డాడు! 'ఒకానొక సమయమందు సంధి విభాషనగు!' భేష్ భేష్! పేరయ్యగారి ప్రభావం పోలేదన్నమాట యింకా!...తల్చుకుంటే యిప్పటికీ వొళ్లు జలద రిస్తోంది! పేరయ్య మేష్టారు వీపుమీద 'వీశ' గుద్దులు గుద్దేవాడు! ఇప్పుడు 'కిలో' గుద్దులు అనాలేమో! ఈమెట్రిక్ సిస్టంతో నెర్వ్ సిస్టం అంతా దెబ్బ తింటోంది, అస్తమానం మార్చుకోలేక! ... పాపం ఆ చంద్ర భాస్కరరావు ఈయన దెబ్బలకు జడిసే కదా, టీసీ పుచ్చుకుని వేరేస్కూల్లో చేరింది! చంద్ర భాస్కరరావు భాస్కరరావు!... ఈరోజు ఈ భాస్కర రావు అన్నది నన్ను ఎదలదులా వుంది! ఏం చేస్తున్నాడో చంద్ర భాస్కరరావు? స్కూల్ ఫైనల్ అయ్యాక విద్వాన్ చదవటానికి వెళ్లినట్టున్నాడు! మేష్టరైవాడూ, పిల్లల వీపుమీద, 'కిలో' గుద్దులు 'అరకిలో' గుద్దులు ప్రాక్టీసు చేస్తున్నాడేమొ!

...అబ్బ! అన్నీ మార్పులే, యీ గవర్నమెంటులో! వీశలు కిలోలన్నారు మైళ్లు కిలో మీటర్లన్నారు! శేర్లు లీటర్లన్నారు! అణాలు పైసలన్నారు. యస్. యస్. యల్. సీ. లో, యల్ తీసేసి యస్. యస్. సీ అన్నారు! ఒక సంవత్సరం చదువు తగ్గించారు!

ఔనా? ..ఇలా వాళ్లు అన్నీ మార్చుకుంటూ పోతే 'నా చిన్నప్పుడు' అని ఎవడేనా ఏదేనా చెప్పబోతే ప్రతివాక్యానికీ వో రిఫరెన్స్‌బుక్ రాయవలసి వస్తుంది!

...అవునూ; ఈవిషయం మీద యెవరూ సుప్రీంకోర్టుకు అప్పీలు చేయటానికి వెళ్లకూడదూ? వెళ్తాచ్చేమో! చెట్టుకింద ప్లీడరు పుట్టా పాపారావు గాణ్ణి అడగాలి ...వెధవ! క్లాస్ మేట్‌వనే విశ్వాసమేనా లేకుండా, కాఫీ పోయిస్తేనే కాని 'లీగల్ అడ్వయిసు' యివ్వనంటాడు! ... ఊహు...కుదరదు'... నా చిన్నప్పటి విషయాలు అంటూ ప్రతీవాడూ మిగిలిన వాళ్లను బోరుకొట్టడం మనుషుల జన్మహక్కు' అనగా ఫండమెంటల్ రైట్! అటువంటప్పుడు గవర్నమెంటువారు ప్రతీదీమారుస్తూ పోతూవుంటే ఆ ఫండమెంటల్ రైటు బంగింపబడునా, భంగింపబడదా?' ఇన్‌ఫ్రింజ్‌మెంట్' అన్నమాటకు తెలుగు భంగింపబడుయేనా?......

...ఏమో! అయ్యే వుంటుంది! పాపం పాత చీఫ్ జస్టిస్ మంచివాడు! ఉద్యోగం మానేసిపోతూ పోతూ వో మంచి పనిచేసి మరీ పోయాడు! నిశానీదార్లు, డబ్బు, అధికారం, అహంకారం, మద్దతుతో హోదాలో కొచ్చినవారు..ష్' ఇటువంటివి గవర్నమెటు ఉద్యోగస్తుడు ఇటువంటివి పైకి కాదుకదా, మనసులోని మూలల్లోకూడా అనుకోకూడదూ! కాన్ఫిడెన్షియల్ రిపోర్టు చచ్చి వూరుకోంటుంది! ఆ తర్వాత మనని చంపుతుంది!...ఆ అటువంటివారు రాజ్యాంగములోని ప్రాధమిక హక్కులను...అవునూ... రాజు లేనిది 'రాజ్యాంగము' ఎలా అవుతుంది? 'పంచాంగం'లాంటి పుస్తకంలా సరిపెట్టుకోవాలేమో దీన్ని'...ఆ! ఆ రాజ్యాంగములోని ప్రాధమిక హక్కులను మార్చకూడదు! మార్చజాలరు! థాంక్ గాండ్! సుప్రీంకోర్టు అను, సుప్రీంకోర్టే లేకపోతే యీ భరతఖండ మే విధముగా దురపిలి విలపిల్లుచుండెడిదో'.....

......'ఓయ్ ఓయ్! రామారావ్! పార్లమెంటు సర్వసత్తాక ప్రతిపత్తినే తిరస్కరించు చుంటివే! పార్లమెంటు మరల ఆ నిర్ణయమును మార్చుచున్నది వినలేవా? పేపర్లో కనలేవా! జాగత్త.......అమ్మో!... ఆహా నీతిగారూ! థాంక్యూ వెరీమచ్! మరి చెప్పారు కాదేం? అబ్బే! పార్లమెంటు అంటే నా కమిత శ్రద్ధా, భయం వగైరాలు! పార్లమెంటు నిర్ణయముల నెల్ల

వ్పుడు తలదాల్చుటయే ప్రజల కర్తవ్యం! కర్తవ్యం సార్! నిజం వొట్టు!...

...అమ్మో! అదీ మార్చేశారా?...ఔరా!... ఆ ఇందాకా 'విలసిల్లు' అన్నట్టున్నాను...చెడ్డగా అవి చెప్పబోతూ విలసిల్లు అనచ్చా? చిన్నప్పుడు చదివిన పాఠాల ఫక్కీయే గుర్తొస్తోంది అస్తమానూ! చిన్నప్పుడు మనసులో పడిన ముద్రలు ఎప్పటికీ చెరగవులావుంది! దీనిమీద ఫ్రాయిడ్ ఏమన్నాడో?... ఆ...ఆ ఫ్రాయిడ్ చెప్పాలేమిటి? నేను చెప్పలేనూ?... అరెరె! బాగా అయింది! కాఫీ చల్లారిపోయింది!...

'శారదామణీ! నువ్వు తెచ్చియిచ్చిన కాఫీ చల్లారి పోయింది! మంచిదానివి కాని కాస్త కాఫీ వెచ్చబెట్టి యిద్దూ!'

అబ్బ! ఈవిడెంత మారిపోయిందీ! చీర బొడ్లో దోపుకుని అదేదో సినిమాలో 'సమరాన నిలువ గలరా?' అన్నట్టు నిలబడిందిరా బాబూ! మాటా పలుకూ లేదేం?...

'ప్లీజ్ మణీ! పొరపాటైంది! ఆలోచనల్లో పడి ఆలశ్యమైపోయింది! ఈసారి యిలా చెయ్యనులే! నువ్వు తీసుకు రాగానే త్రాగేస్తానుగ!'

...అమ్మ! ఈసారికి బ్రతికి పోయాంరా నాయనా! 'దినదిన గండం నూరేళ్లాయుష్షు!.. మామ్మ చెప్పిన సామెతా అది?.. ఔనౌను! అదే అదే! అంటే అలా బ్రతికే నేను పామునా?...నో నో! నేను పామును కాదు! మనిషిని! అయితే మరి శారదే పాము! అలా అయితే శారద నేనంటే భయపడాలిగ! ఆమె భయ పడుతున్నట్టు కనిపించటంలేదు! కనక నేనే పామును! కాదు కాదు! శారదే పాము!...

...చ ఛ! ఎంత క్రూరంగా ఆలోచిస్తున్నాను! శారద యెంత మంచి.! అస్తమానం ఆలోచనల్లో కెగిరిపోయే నన్ను 'భరించి'...అదేమిటీ! ఇది మూల సూత్రాలకు విరుద్ధంగా లేదూ?...'భరించువాడు' భర్త కదా? మరి శారద నన్ను భరిస్తే ఆమె నా భర్తా?...సిల్లీ! కనుక భరించు అన్న మాట యిక్కడ సామాన్యార్థమున కాక విశేషార్థమున వాడబడినది... విశేషార్థమా, నానార్థమా? ఏదో వో అర్థం...నా శ్రాద్ధం!...వెధవది ప్రాసకోసం పోయి నన్ను నేనే తిట్టుకుంటున్నాను!...ఆ! పేరయ్యగారి నోట్సే ఆధారం మనకి!...'షి బేర్జ్ పేషంట్లీ బేరింగ్ విత్ మీ' అన్న దానికి తెలుగుగా యిక్కడి 'భరించు'ను అర్థం చేసుకోవాలి!...

కనుక 'కాలేని మహాకవీ రామారావూ...' మహాకవి, మహాకవి...'మహాకవి కాళిదాసు' ఏ సంవత్స రంలో రిలీజైందబ్బా? ఫస్టు రిలీజా, రెండోసా రొచ్చిందా?...ఆ సినిమాలోనే కదా నేను శారదామణిని చూసి, మెచ్చి, మనసిచ్చి,.. ఓహో! యేం యమకం పడుతోందీ! . యమకమా, అనుప్రాసా?...ఆ! మన సిచ్చి, ఆమె తెచ్చిన కట్నం పుచ్చుకుని, మెడలో 'తాడు' కట్టి...చ ఛ! తాళి అనబోయి తాడు అన్నట్టున్నానే!... గేదెకి ఆవుకీలా తాడేమిటి?...అఫ్ కోర్స్...ఒకలా చూస్తే అది తాడు కట్టడమే!...'షి బేర్జ్ వన్ ఆఫ్ యువర్ పొసెషన్స్'...స్త్రీ పురుషుని ఆస్తి!... ఎందరు వీరేశలింగాలు తప్పన్నా...ఎందరు చలాలు కాదన్నా...మనుస్మృతి వొప్పదు...మనం మనుస్మృతిని తప్పు వొప్పము!...లాభసాటి పుస్తకాలే మన కత్యవ సరము!...ఆప్యాయకరము...కనుక తాడు కట్టడమన్నదే రైటు! నీ సంపదను త్రాళ్లతో బంధించుకున్నట్టే ఆమె మెడలోనూ త్రాడు కట్టి బంధించుకుంటావు!... ఈ 'త్రాడు కట్టు' అన్నది శతాబ్దాల తరబడి సాగుతూ వుండి వుంటుంది...వ్యావహారికమున త్రాడు పదము భ్రష్టమై...ఎవరో తాడు బదులు 'తాళి' అని వుంటారు!...'డ, ళ, ల క భేద మున్నదో, లేదో, ప్రొఫెసర్ గంటి జోగిసోమయాజులుగారి 'ఆంధ్ర భాషా వికాసము'లో పరిశీలించాలి!......ఆ! అలా తాడుకట్టు అన్నది తాళికట్టుగా మారి వుంటుంది. అదే ప్రచారంలో కొచ్చి నిలిచింది! . ...అబ్బ!' తాళి' పుట్టు పూర్వోత్తరాలపై ఎంత పెద్ద పరిశోధన చేసాను!..... దీని కే యూనివర్శిటీ వాళ్లా గౌరవ డాక్టరేట్ ప్రదానమేనా చెయ్యరా?...

రేపు తప్పకుండా దీన్ని 'పురుషలోకం' పత్రికకు పంపించాలి..వాళ్ళ 'ఆంధ్ర విద్యా భూషణ' బిరుదివ్వొచ్చేమో!...లేకపోతే 'పురుష గౌరవ రక్షక' అన్న బిరుదేనా యిస్తారు.

...అమ్మో! ఆ బిరుదుల సంగతి ఎలా వున్నా 'నారీలోకం' ఎడిటర్ శ్రీమతి మణీరామా రావ్ కీ సంగతి తెలిస్తే మన మెడ కురి తప్పదు! త్రాడు తోనే! . అవును! త్రాడు గురించిన ఆలోచన త్రాటిని మెడకు దెచ్చును!.. సో బివేర్ ఆఫ్ విమెన్ మిష్టర్ రామారావ్!'...

...అమ్మయ్య! కాఫీ కొంచెం లేటుగా తెచ్చింది. శ్రీమతిగారు! ..లేకపోతే నా ఆలోచనల పసిగట్టి, కాఫీ కప్పు నా మొహాన్నికొట్టి, వారం రోజులుపాటు హోటలు భోజనం శిక్ష విధించి వుండేది!..

..వాళ్ళ ఆలోచనలు పై వారికి తెలియనీక పోవడం, పై వారి ఆలోచనలు...అందులోనూ మగ వారివి...క్షణంలో తెలుసుకోవడం ఆడవారికి దేవుడిచ్చిన వరం!...

'హాయ్ భగవంతుడా! పురుషుడవై యుండియు స్త్రీలకేల నీ యాధిక్యత ప్రసాదించితివి? నీవును ముప్పాళ రంగనాయకమ్మగారివలె స్త్రీ పక్షపాతివా?'

...ఇంక మనం లేచి స్నానం చెయ్యాలి! ఉదయమే తీరికగాార్చుని ఆలోచనలు నములుతూ, మేస్తూ, నెమరేస్తూవుంటే...చఛ! యీ వుపమానాలన్నీ పశువులకు సంబంధించినవే! ఆ'అలా బద్ధకంగా కూర్చుంటే 'మాసంబుల్ రోజులున్ ఘడియలు గడచును!'... ఓహో! ఎంత గొప్పగా వొచ్చింది! ఇది ఏ గొప్ప కవిగారూ రాసింది కాదు కదా?...అబ్బే అయివుండదు! ఏ బుద్ధివున్న కవేనా యిలా ఎందుకు రాస్తాడు?... ఘడియల దగ్గరనుండి రోజులు మాసాలు చెబుతాడు కాని యిలా తిరగేసి చెబుతాడా?...కనుక యిది తప్పక మన స్వంతమనుటలో సందియము లేదు!... ఇందులో 'అట్నుంచి నరుక్కురా' అన్న సిద్ధాంత మేమీ వుపయోగించలేదు కదా?...మన కవిత్వ వ్యాఖ్యాత యెవడేనా వుంటే వాడు నిగూఢ కవితా రహస్యాల్ని వెలికి లాగాలి! మన కవిత్వంలో అందాలు మనకేం తెలుస్తాయ్!...రాయడం నీ వంతు; వ్యాఖ్యానించడం వాళ్ళ వొంతు! శ్రీ కృష్ణ భగవాను డేమన్నాడు?...ఏదో నీకు తోచింది రాసి పారెయ్ అన్నాడు!...ఎవడో ఒకడు లేని అందాలు చూపించు ఘనుడు పుట్టుకు రాడా?...ఇప్పుడు కాకపోతే మనం గతించిన వొందేళ్ళకు!...ష్యూర్! ఎవడో ఒక డుంటాడు కనుక ఏదో ఒక చెత్త అవశ్యము రాయుటయే కర్తవ్యం!...

...మళ్లీ చిన్న కునుకొస్తోంది. కళ్ల ముందుకు చెదిరిన స్వప్నాల శకలాలు జేరుతున్నాయి...'నిద్రా దేవత నిన్ను కోరి వలచెన్' పదం గుర్తొస్తోంది'... అవును మరి ..పుస్తకం చేత్తో పట్టుకుని పరీక్షల ముందు జోగుతూంటే పెద్దమ్మ అలా అనటంలో తప్పేముంది?...పోన్లే! దాని మూలాన్నేనా కోపం వచ్చి గట్టిగా చదివి యస్. యల్. సీ. లో...యస్. యల్. సీయా యస్. యస్. యల్. సీయా?...స్కూలు ఫస్టొచ్చాను! బి యస్సీలో ఫస్టుక్లాసు తెచ్చాను!...

'..చ్చి ఏం వుద్ధరించావ్ మిష్టర్ రామారావ్!'

'అబ్బే యేం లేదు సార్! రెవిన్యూ డిపార్టుమెంటులో ఒక పెద్దశిలనయ్యానండి! అయ్! అదేవండి! యు డి సి నండి!...నా వెనకాల సెప్టెంబరులో పాసైన వెంకటేశం ఐ. యే. యస్. పాసై కలక్టరయ్యేడండి!'... 'అంతా విధి విలాసం! ఏడవకుము మిత్రమా ఏడవకుము!'...ఓహో! ప్రశ్నలు జవాబులు, ఏడ్పులు, ఓదార్పులు అన్నీ మనలోనేనా? ఆత్మ ప్రపంచమును సృష్టించుకొనుట యన నిదియేనా? ఆత్మ సర్వాత్మగా వ్యాపించి యున్నది కనుక, మన మానసమందున సర్వమును మనమే!...బ్రహ్మాండమైన అద్వైత సిద్ధాంతం!...

...'సో, బాయ్! ఛ! బాయ్ ఏమిటి? మన లణ్ణి కావటం లేదూ?...సో వోల్డ్ మాన్! నీవె ప్రశ్నించు ప్లీడరుగా, సాక్ష్యమిచ్చు ముద్దా

తీర్పునిచ్చు జడ్జీగా; ఆకాశవాణిగా...నోనో! ఆ మాట తీసెయ్యి! భారత రిపబ్లిక్‌లో ఆకాశవాణికి పోటీగా కాని, ఆ పేరుతోకాని మరొకటి వుండటానికి వేల్లేదు!...పోనీ భారతీయ ప్రాచీన సంప్రదాయం ప్రకారం 'అశరీరవాణి' అంటేనో!...అబ్బే! ఈ మాట మరీ అపశకునపు మాటగా వుంది! 'అశరీర' అంటే 'వితౌట్ బాడీ' వొన్లీ స్పిరిట్! అంటే దెయ్యంగానా? అబ్బే! కుదరదు! నాకు చావాలని లేదు! ఐడోంట్ వాంట్ టుడై!...హైద్రాబాదు బోర్డులో రాసినట్టు పోనీ 'వితంతు వాణి' అందామేమిటి?... ఊహూ! మళ్ళీ అదే ఫలితం! నన్ను వదిలితే శ్రీమతికి తగులుకుంటోందే! అఫ్ కోర్ర్! నేను అశరీరుడనైనను మా శ్రీమతి వితంతువైనను నేను చావవలసినదే! ఊహూ! నేను చావను! చావటం నా కిష్టంలేదు. పాపము శమించు గాక! ఇంతకీ అసలు గొడవ మరచిపోయినట్టున్నాను'.. అట్లు నేనే ప్రాసిక్యూటరు, న్యాయాధికారి, ముద్దాయి అయి అలరారుచుంటినా? అహా ఏమి మదీయ భాగ్యము !

మళ్ళీ చిన్నతనంలో నాటకాలలో విన్న డైలాగుల యిమిటేషను!...తప్పదులావుంది ఇది!.. తప్పదు!

చిన్నతనం మనిషిని చచ్చిపోయేదాకా వదలదు? అతన్ని వెంటాడుతూనే వుంటుంది! చచ్చి మళ్ళీ పుట్టాక మళ్ళీ ఎలాగూ చిన్నతనమే కనుక చిన్నతనం ఎటర్నల్! సర్వకాలముల యెందును ఉండునది! ఎప్పుడూ మనిషి నొదలదు.

...ఒహో! ఈ రోజు యెలాంటి గంభీర విషయాలను కనుక్కుంటున్నాను!...

## భాగం 2

ఇంక యిప్పుడేనా స్నానం చెయ్యాలి! చెయ్యాలయ్యా చెయ్యాలి. గంటలు గంటలు ఆలోచనలలో కాలం వృధాచేసి చెయ్యాలి చెయ్యాలి అనుకోవటం! చెయ్యాలి చెయ్యాలి!...వెధవది తరువాత మాట తోచకపోతే రాజకీయ నాయకుడిలా అదే మాటను వల్లిస్తూ కూర్చోవడం. నిన్న మీటింగుకు వెళ్ళినందుకు భలే జబ్బే తగులుకుంది!

......'కొబ్బరి నూనె తలకు పట్టించుకో మిత్రమా!..'అలాగే సార్! అవశ్యం!'.. అవునూ కాలేజీలో చదివేటప్పుడు ఏ హెయిరాయిల్ వాడేవాడినబ్బా? కాల్గేట్ పెర్‌ఫ్యూముడు కేష్టరాయిల్, టాటా, స్వస్తిక్, నాస్తిక్, ఛ! 'నాస్తిక్' సినిమా! హెయిరాయిల్ కాదు! ఏది వాడేవాడి, నేది వాడేవాడిని? గుర్తొచ్చి చావటంలేదు! పెద్దయ్యేకొద్దీ. కొద్దికొద్దిగా మాత్రమే సంగతులు గుర్తుంటున్నాయి. కతంబేమో? . ఆ! ఏదేమిటి? హాస్టల్‌లో అందరూ ఏది తక్కువ వాడితే అది! 'మెజారిటీ మాట వజ్రాల మూట!' ఓహో! ఏదయితేనేం? ఏదో ఒకటి!...

'మిష్టర్ రామారావ్! నీ జీవితంలో స్వర్ణ యుగం గడిచిపోయింది! మిగిలిందేమిటి? ఏమిటనుకుంటున్నావు?'

'భార్యా బిడ్డలూ వాళ్ల సంరక్షణా సార్!'

'నీ గురించి నువ్వేం చేసుకున్నావ్?'

'నాకోసం ఏమీ ఎందుకు సార్? నా భార్యా బిడ్డలే నా సర్వస్వం! నాకు జీవితంలో అంతకంటే యింకేం అక్కర లేదండి! నేనేమై పోయినా ఫరవా లేదు!'

...అబ్బ! గొప్ప సినిమా డైలాగులు వాడేశాను! ఆత్రేయ తాతలా రాశాను!...

.. కాని చివరలో చిన్న తిరకాసున్నట్టుందే! నేనేమై పోయినా ఫరవాలేదేమిటి నా మొహం!

'వెన్ యెవ్వెరి థింగ్ యిన్ యూ హేజ్ బికమ్ యాష్, ఎవ్వెరి అదర్‌థింగ్ యీజ్ ట్రాష్!'

ఓహో! ఆంగ్లలోకూడా ఏం చక్కటి వాక్యాలు వెలువడుతున్నాయి! ఇంక మనమూ 'ఉభయ భాషా ప్రవీణ' అనగా ఆంగ్లాంధ్ర విద్వాంసులమయిపోయినట్టే.

ఆంగ్లంలో చఛ! పాతకాలం వాళ్లలా ఆంగ్లమేమిటి నా మొహం! ఇంగ్లీషు అందాం! ఆ!... ఇంగ్లీషులో కవిత్వం దంచేస్తాం!

.. ఏమిటి ఏ మూలనుంచో నాలోని తెలుగు కవిగాడేదో కూస్తున్నాడు?' ఇంట గెలిచి రచ్చ గెలవాలోయ్ చవటా' అనా?

...'ఔరా! తెలుగు తెలుగని, తెగులు తగిలిన కోడిగా, అరిచినందుకు ఎంతమాటన్నావ్, కాలేని తెలుగు మహాకవీ?...

...నన్నే 'చవటా' అన్నావా?...

కాలదూరాల నతిక్రమించి జనం విశ్వాంత రాళాల్లో తిరిగొస్తూవుంటే యింకా యింట గెలవట మేమిటోయ్ నీ మొహం?...

'రచ్చ' అంటే శుక్రుణ్ణో, కుజుణ్ణో గెలిచక అప్పుడు 'ఇంటి' అంటే భూమిని గెలుస్తాం! .. చంద్రునిపై మానవ విజయం వినలేదా? పత్రిక లలో బొమ్మలు కనలేదా?

అమెరికా రష్యావాళ్లకంటె గొప్పవాడివా తెలుగు కవీ? ఏది 'యిల్లో' ఏది 'రచ్చో' వాళ్లకంటే నీ కెక్కువ తెలుసా? కాసేపు నోరు మూసుకు కూచో!'

...అయినా అసలు తెలుగువాడెవడూ, గొప్ప వాడని మరో తెలుగువాడిచేత గుర్తింపబడడు! (చచ్చి పోతే తప్ప) కనుక అవశ్యమును మనము ఆంగ్ల మందున గ్రంథ రచన గావించి, వివిధ విదేశీయుల అభి నందన లంది అప్పుడే యీ 'యిమిటేషన్ మైండెడ్' తెలుగువారిచే గుర్తింపబడెదము గాక!...

...అబ్బో! ఏం చక్కటి వాక్య నిర్మాణం! ఏం చక్కటి వాక్య విన్యాసం! అవునూ, విన్యాస మేమిటి సన్యాసంలాగ!...ఏదో వొకటి! ఈ దెబ్బతో ఆ తెలుగు 'కుకవి'గాడి నోరు మూయించా!

'హా! లేకపోతే నాలోనే వుంటూ, నా వుప్పు తింటూ, నన్నే ఎదిరించుటకు సాహసించునా యీ తెలుగు కవి పురుగు!'...

'వెల్‌డన్ మిష్టర్ రామారావ్! యూ ఆర్ ప్రొసీడింగ్ యిన్ ది రైట్ డైరెక్షన్!' ..

...'థాంక్యూ సార్! థాంక్యూ వెరీ మచ్! మీ బోటివారి అండదండలవలననే సుఖముగా బ్రదుకు చుంటిని! ..

...అయితే ఇంతకూ ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడకు చేరాను? గతకాలపు వైభవాల గురించిన ఆలోచనలలోనుండి యిక్కడకు చేరానా? ఏం చేస్తాం? ఆ రంగు రంగుల రోజులు ఇంక యేనాటికీ తిరిగి రావు! ఇప్పుడు మిగిలినదంతా స్ట్రగుల్‌ఫర్ ఎక్జి స్టెన్స్!' జీవనానికై పోరాటం! ప్రతిదానికీ ఆరాటం! రంగులరాట్నంలా తిరగటం!

ఔరా! ఇంత తిట్టినా ఆ కలిగాడు మళ్ళీ చక్కటి యమకాలు సప్లై చెయ్యటం మానలేదు!

...ఔను సప్లై చెయ్యక ఏం చేస్తాడు పాపం!' 'హి యీజ్ యెపూర్ తెలుగూ కవి!'—ఒక ప్పుడు అక్షరలక్షలు పొందేవాడట! ఇప్పుడో!...అక్ష రాని కింత అని యిచ్చుకుని అచ్చు వేయించుకుంటు న్నాడు పుస్తకాలు!...కనుక రోజులు ఎప్పుడూ వొకేలా వుండవు! 'ఓడలు బండ్లు బండ్లు ఓడలు అగును!'... సో! ఒకానొక సమయమందు డబ్బు పుచ్చుకొను వాడును యిచ్చుకొనవలసి వచ్చును!

...'ఇంక యీ విషయానికి ఫుల్‌స్టాప్‌పెట్ట లేవయ్యా బాబూ!' కసురు కుంటున్నాడు, కాల పురుషుడు! మరి కాస్సేపు ఆలోచించుకుంటే వీడి సొమ్మేం పోయిందో! ... 'కొద్ది సమయమందే వేల కొలది ఆలోచనలు చేయుట దేవుడు మానవమేధ కొసగిన వరము!...మేధకులుతప్ప అందరు నది నావలె సద్వినియోగ పరచుకొందురు! నా జన్మహక్కువ కడ్డు విషయంబుల సైరింపనోవను.'

'అదీ! అలా వుండాలి నిర్ణయమంతే! ఇంక నీ యిష్టం! ఫుల్‌స్టాప్ గురించి ఫుల్‌స్టాప్ లేకుండా ఆలోచించుకో!పడకకుర్చీలో మళ్లీ పడుకో నేస్తం!'...

'ఓహో! ఏ ప్రోత్సాహం! అలా వుండాలి! ...'థింకింగ్ యీజ్ పాసిబుల్ యిన్ హ్యూమన్ మైండ్ ఎ లోన్!' ఏమన్నాడా జంతు శాస్త్రజ్ఞుడు?...

మిగిలిన జంతుజాలములలో యినిస్టింక్ట్ తప్ప ఆలోచనే లేదట! నిజమేనా? ఏనా? ఏనా? ..

అవునూ 'ఫుల్‌స్టాప్'కు తెలుగులో పూర్వం ఏం గుర్తు వాడేవారో?...పాత తాటాకు గ్రంథాలు పరిశీలించి చూడాలి! రాతి శాసనాల ప్రతి చిత్రాల్లో 'అంటే ఛాయాచిత్రాలనేనా నీ ఉద్దేశం?' 'అవునవును! అదే అదే! ఆ ఫోటోల్లో ఈ బాపతు యేం వున్నట్టు లేదే?..'పాత 'భాంతు'లన్నీ బాగా తిరగేశావా నేస్తం?...ఓ నాదగ్గరున్న సమస్తం తిరగేసి బోర్లేసి చూశా! లేదు లేదు! లేనేలేదు!' ..

అయినచో యీ విషయాన్ని కూలంకషంగా పరిశీలించి ఓ వ్యాసం వ్రాసి 'భారతి'కి పంపిద్దాం! ఎవరూ మన వ్యాసం ఖండించకపోతే మనకి 'చారిత్రక పరిశోధక శిఖామణి' అని బిరుదు కూడా రావచ్చు!... కొంపదీసి యే చారిత్రకాచార్యుడో, చరిత్రాచార్యుడ? చారిత్రకాచార్యుడా?.. ఏదో ఒకటి లెద్దు! ఆయన గారు పనిలేని రోజుల్లో (ఎక్కువ రోజులు అసలు వాళ్లు పనిచెయ్యనే చెయ్యరుట కదా! మిగిలిన వాళ్ల చేత పని చేయించటంలోను, యింతకుముందెప్పుడో చేసినదాన్ని గురించి, చర్చించటంలోనూ కాలాన్ని గడుపుతారని విన్నానే!) ..ఆ అలాంటి ఆచార్యులుగారెవరో, మన వ్యాసంలోని వాక్యం, వాక్యాన్ని, శత సహస్ర ఖండాలుగా, ఏకిపారేస్తే మన పని గోవిందో గోవింద!... అఫ్ కోర్స్! ఆయనమీద కోపమున్న మరో ఆచార్యులుగారెవరో మన రక్షణకొచ్చి ద్రౌపదిని అలనాడు శ్రీకృష్ణభగవానుడు కాపాడినట్టు మనని కాపాడవచ్చు! మన వ్యాసంలోని ('లోని'యా 'లేని'యా?) గొప్పదనాలను నిగూఢ రహస్యాలను, నగ్నసత్యాలను ...ఔను నగ్నసత్యం అంటే ఎలా వుంటుందబ్బా? 'సత్యము ఎల్లప్పుడు తేజోవంతమై వెలుగొందుచుండును!' అని ఎవరో చెప్పారు కదా! అంత తేజోవంతమైనది ఇంకా నగ్నం కావడం ఎందుకు? .. నగ్నం సత్యం యెలావుంటుందో తెలుసుకోవాలని చిన్నప్పటి నుండి చూస్తున్నా! సత్యమే కనిపించి చావకపోతే యింక నగ్న సత్యమెక్కడ కనిపిస్తుంది?'

...ఆ అలాంటి గంభీర విషయాలను వెదికి చూపించవచ్చు. అప్పుడు దానిమీద వాళ్లిద్దరూ నెలల తరబడి, కొండొకచో సంవత్సరాల తలబడి కీచులాడుకుంటారు! మనం పెదవి విప్పనక్కర లేదు, కలం పట్టనక్కరలేదు! . ఇంకా పదేళ్లు పోయాక 'చూడండి ఫలానా సంవత్సరం, ఫలానా నెల భారతిలో నా వ్యాసం' అని రాసుకోవచ్చు! దాన్ని ఖండించిన సంగతి మనం వ్రాయనక్కరలేదు!... మన ఖర్మం చాలక దాన్ని ఖండించిన ఆయన అప్పటికీ బ్రతికివుంటే కష్టమే! ... 'చూడండి ఫలానా నెల భారతిలో నా ఖండనవ్యాసం' అంటాడు! . 'ఇది నొక విషవలయం!' ... ఎక్కడో ఎప్పుడో విన్నపాట గుర్తొస్తోంది!

'హోయ్! రామారావ్! ఇంక యీ రోజుకు ఆఫీసుకు వెళ్లవేమిటి? తెములవయ్యా బాబు!'

.. వెడదాం వెడదాం! వెడతానుసార్ ఆఫీసుకు వెడతాను ! ఆఫీసు . ఆఫీసు...ఆఫీసు! ఆఫీజు! ఫీజు లేనిది ఆఫీసు' డాక్టర్లు, యాకర్లు, లాయర్లు ఫీజులు' లు తీసుకుంటారు గనుక వాళ్లు ఆఫీసుల కెళ్లరు! మనం జీతభత్యాలు, భత్యం అంటే దానంగా యిచ్చేదా యేమిటి కొంపదీసి?...ఒకొక్కప్పుడు అదనపు భత్యాలు తీసుకుంటాం! (ఇవి ప్రభుత్వం కనికరించినప్పుడు వస్తాయి !)...

.. అఫ్‌కోర్స్! మనం ప్రభుత్వాన్ని జీతం యెక్కువ చెయ్యమని లేకపోతే స్ట్రైకు చేస్తామని బెదిరిస్తాం! ప్రభుత్వం, డొక్కచించేస్తాను జాగర్త అని బెదిరిస్తుంది! 'మార్చినెల రణరంగకాలం! అప్పుడే యన్‌జీవోలు 'మార్చి ఫార్వర్డ్!' అంటారు!... బెదిరింపులు—అదిలింపులు సస్పెన్షన్‌లు, అరెస్టులు కాల్పులు...లాఠీచార్జీలు! చివరకు 'రాజీలు'! మరో నాలుగు రూపాయల పెంపుదల! ఇంత కష్టపడి యీ అదనపు భత్యాలు సంపాదించగానే బజార్లో వర్తకులు ధరలకు రాకెట్లుకట్టి పేలుస్తారు!... ఆ వెంటనే హోమాదిరిగావున్న రేట్లన్నీ కృత్రిమ ఉపగ్రహాల్లా (ఉపగ్రహాలా, శని గ్రహాలా?) తార్ధా

పథానికి వెళ్లిపోతాయి!...మనం తెచ్చుకున్న అదనపు భత్యం చీదేసిన తారాజువ్వలా క్రిందే వుంటుంది! అంటే బజారులోని రేట్లు మనం సంపాదించే అదనపు భత్యాలు 'దొంగాట' ఆడుకొంటూ వుంటాయి! అప్పుడు ఉద్యోగస్తులు మళ్లీ డబ్బు కోసం కటకట లాడుతారు! (ఈ ప్రయోగం అర్థం ఏమిటో?) పళ్లు కటకటా ... కటకటా కంటే పటపటా కొరుక్కుంటా రంటే బావుంటుందే మళ్లీ సైనికులు ..నోటీసులు . ఊస్టింగులు .. రాజీలు .. మళ్లీ వో ఆరురూపాయల పెరుగుదల! . 'ఇది వొక విషవలయం!' 'ఛ! మరీ యివాళ 'వొకాబ్యులరీ' లేని, సొంత భావాలురాని కవిగాడిలా వొకే వాక్యం పట్టుకు వేళ్లాడుతున్నా నేమిటి? ఇందాకా వోసారి ఆ మాట ఉపయోగించలా? పోనీ కాస్సేపు 'ఫర్ ఏ ఛేంజ్', యింగ్లీషులో విష వలయం అందాం! 'విషస్ సర్కిల్' ఔనూ... డాక్టర్లకీ లాయర్లకీ...ఆఫీసు ఉద్యోగస్తులకుండే యీ బాధలు, లేవు కదా!.. బజారులో రేట్లు పెర గ్గానే వాళ్ల ఫీజులూ పెరుగుతాయి; వొక్కొక్కప్పుడు రెట్టింపు వేగంతో! ..వాళ్లవీ 'రేట్లు' అనొచ్చుగా?... పెద్ద స్టైలుగా 'ఫీజు' అనాలేమిటి?... 'అయితే నీకేమయ్యా రామారావ్! సొంతంగా బతికేవాడు తన కొచ్చేదాన్ని యేమన్నా అనుకుంటాడు!'...గవర్నమెంటు నౌఖరీలో బతికే నేను వాళ్లనేం అనడానికి కూడా హక్కు కోల్పోయితినా?.. నౌకరీ, నౌకరీ, నౌకరీ! 'అవునయ్యా నౌకరీనే,...'ఎంప్లాయ్‌మెంటు'కు తెలు గేమి టనుకున్నావ్?' 'నౌఖరుకంటే నువ్వేం యెక్కు వోయ్ రామారావ్? కొంచెం పెద్ద నౌకరువి, లేదా నౌకరు పెద్దవి! ఎగువ తరగతి గుమస్తావి!'...అటు వంటి నౌఖర్ల కిచ్చేవి జీతభత్యాలు కాక ఫీజు లెలా అవుతాయ్? నీకిచ్చేవి తప్పకుండా జీతభత్యాలే!...

...ఇదీ పూర్తి సత్యం కాదుగా? అప్పుడప్పుడు ఆఫీసుల్లో వాళ్లూ 'ఫీజులు' సంపాయిస్తూ వుంటారు; 'కాగితాని కింత', అని! వీళ్లు డాక్టర్లు లాయర్లలా బాహాటంగా బోర్డు కట్టి ప్రాక్టీసు చెయ్యలేరు; నలుగురికీ నోటిమాట ద్వారానే తెలుస్తుంది వీరి ప్రాక్టీసు సంగతి! ఏమాత్రం కాగితాలపై కెక్కినా వాడి ఉద్యోగం గోవిందా!...తెలివైనవాడు, నోరు మెద పక, నలుగురి ఎదటా చేయి చాచక, సైగలుచేసి. ఫ్యాన్ ద్వారా తెలియజేసి, డ్రాయరు సొరుగు సగం తెరిచి, పని కానిస్తాడు! . మరీ తెలివైనవాడు తాను పంపిన కాగితం అపోలో—13 రాకెట్‌లా మళ్లీ తన దగ్గరకే తిరిగొచ్చేలా చేస్తాడు! దాంట్లో ఎలక్ట్రిసిటీ ఫెయిల్యూర్‌లాంటి ప్రతి చిన్న లోపాలుంటాయి! మళ్లీ అదనపు ఫీజు ముట్టినప్పుడే దాన్ని ముందుకు గెంటుతాడు!...'టూఫీజ్ ఫర్ సింగిల్ వర్క్!'... అవును! ఇతనుమాత్రం డాక్టర్లకి లాయర్లకి ఎందుకు తీసిపోవాలి! వాళ్లు వొకే కేసుకు ఎన్నోసార్లు ఫీజులు గుంజటంలా?...

...హో! ఎవడి ఫీజుల గొడవో నా కెందుకు? ఈరోజు గడవటం ఎట్లాగో ఆలోచిద్దాం!' పద వయ్యా రామారావ్ స్నానానికి!' ఆగునేస్తం! కాస్త బుర్రకు కొబ్బరినూనె పట్టించనీ!' 'సరే సరే సరే! ఈలోపల టైమయిపోతుంది! ఆ తరువాత నీదుంప తెగుతుంది.'

...అబ్బబ్బ! వెధవపోడి! మాట తడుముకో కుండా ఏడిపిస్తాడీ లోలోనివాడు! నాకేనా అందరికీ యింతేనా? మన బుర్రలో స్క్రూలు 'లూజ్'గా వున్నాయా? ..

...అరె! గడ్డం యింత మాసిపోయిందేమిటి? ఇలా ఆఫీసుకెడితే యింకేమన్నావుందీ? సుజాత. లక్ష్మి. యెంత వేళాకోళం చేస్తారు?...' తిరుపతి మొక్కుండి?' అని టక్కున అడిగేస్తారు! అర్జం టుగా గడ్డం గీసుకోవాలి! ఏది ఏది నా రేజరేది? బ్లేడు బ్లేడు, ప్రిన్స్ బ్లేడు!' 'ఈకలాంటి మెత్త దనంకోసం ప్రిన్స్‌బ్లేడునే వాడండి!' ఆ ఎడ్వర్ టైజ్‌మెంట్ చదివేకదా డజనున్నర బ్లేడ్లు కొను క్కొచ్చా!

'...అయినా మరీ అడ్వర్‌టైజ్‌మెంట్లపై ఆధారపడే బతుకైపోయిందే! తిండికి, గుడ్డకు,

యిళ్లకు, పెళ్లిళ్లకు, చావులకి, సంబరాలకి, అన్నింటికీ అడ్వర్ టైజ్‌మెంట్లే ఆధారం! ఆఖరికి పిల్లల్ని కనడానిక్కూడా గవర్నమెంటు వారి ఫామిలీ ప్లానింగు అడ్వర్‌టైజ్‌మెంట్! దాని ప్రకారం రెగ్యులేట్ చేసుకోవాలి! 'దో యా తీన్ బచ్చే!' 'బచ్చే దోయా తీన్!'

...'ఇది చెయ్యి! అది చెయ్యకు! దీనినేకొను! దాన్ని కొనకు! ఇది పూర్తి స్వదేశీ! అది పూర్తి విదేశీ! మా సరుకు మంచిది! మా సరుకు మరీ మంచిది! మా పత్రికలోనే ప్రకటనలు చెయ్యి! నేను మంచి వాణ్ణి నాకు వోటెయ్యి! వాడుత్త వెధవ వాడికి వోటెయ్యకు! ఒద్దొద్దు! చెయ్యి చెయ్యి ఒద్దొద్దు! చెయ్యి ఒద్దొచ్చెచ్చెయ్యి!

...అబ్బ! ఏదీ ఎవరూ నన్ను సొంతంగా చెయ్యనివ్వరులా వుంది!

...ఊహ్ ఇంక వొప్పుకోను! ఏళ్ల తరబడి ప్రకటనలను నూరిపోసి సొంత ఆలోచనకి ఆస్కారం లేకుండా చేసారు! ఇంకఛస్తే ఎవరు చెప్పినట్టూ చెయ్యను! 'నినద భీషణ శంఖము దేవదత్తమే!' థాంక్యూ గిరీశం! మంచి కొటేషను అందించావ్ సమయానికి!

'మైలార్డ్' ఐ అబ్జక్ట్ టు దిస్ గ్రేట్ యిన్‌జస్టిస్ అండ్ యిన్‌ఫ్రిన్‌జ్‌మెంట్ ఆఫ్ మై ఫండమెంటల్ రైట్ ఆఫ్ సెల్ఫ్ థింకింగ్!'

'యస్ మిష్టర్ రామారావ్! యువర్ అబ్‌జెక్షన్ యీజ్ ఆప్ హెల్డ్!'

'హుర్రే! శ్రీ ఛీర్స్‌టు రామారావ్ ది గ్రేట్!' ఒంటరిగా పోరాడి విజయం సాధించావ్! అభినందనలు మిస్టర్ రామారావ్! 'థాంక్యూ సార్! థాంక్యూ మేడమ్! థాంక్యూ ఎవ్విరిబడీ!'

'ఓయ్ రామారావ్! గెడ్డంపని ముగిస్తావా' మీ ఆవిడకు నీ సంగతి గుర్తొచ్చేలా చెయ్యమంటావా'

'ఓయ్ ఆలోచనా! కాస్సేపు నోరు మూసుకో!' తొందర, తొందర, తొందరగా...అబ్బ! ఈ బ్లేడు కనుక్కున తెగిందే! ఆలోచనా ప్రవంతీ తెగింది! రక్తనాళం నిరంతరంగా...నిర్ నిర్ నిరంతరంగా, రక్తాన్ని జెట్‌జెట్‌గా, జెట్ వేగంతో బయటకు చిమ్ముతోంది!...హు!.. అమ్మమ్మ తిడుతోనే వుండేది! 'వెర్రి వెధవ! ఆలోచనలు మరీ ఎక్కువ! ఏ పని చేస్తున్నా మరో పది పనుల గురించి ఆలోచిస్తాడు' అని!' 'అమ్మమ్మా! స్వర్గంలోనే వున్నావో, నరకంలో వున్నావో కాని నీ బుర్రలో టెలివిజన్ వుంది! నీ మెదడులో నా జాతకం, (భవిష్యత్తు) ముద్రించబడి వుంది! అందుకే అన్నావు 'ఈ వెధవ పెద్దగా పైకి రాడు! ఎలాగో రోజులు గడుపుకు పోతాడు' అని! 'వాక్శుద్ధిగల అమ్మమ్మా! నీ మాటే నిజమైంది! నీ ఆత్మకు శాంతి కలుగుగాక!'...

...ఇప్పటికి చచ్చిచెడి రక్తం ధారగా ప్రవహించటం ఆగింది! మహాకవి శ్రీ శ్రీ 'పులి చంపిన లేడి నెత్తురు కావాలోయ్ నవకవనానికి' అన్నాడు. నన్నడిగితే 'బ్లేడు తెగినగడ్డం నెత్తురు, కావాలోయ్ నవాతి నవ కవనానికి!' అంటాను! ఆ రక్తపు ఎరుపును చూస్తే ఎంత ముచ్చట వేస్తుంది! అంత చక్కటి ఎరుపును ఎవరోకాని రంగుల్లోకూడా చిత్రించలేరు కదా! అది చూడగానే ఏడుపుదో, సంతోషందో ఏదోవొక కవిత్వంరాక మానదు! అదుగో! నాకే వచ్చేస్తోంది!' 'బ్లేడులు తెగిన, గడ్డాల్ మండిన సోదరులారా రారండి! తెగని బ్లేడులకై, మండని గడ్డాలకై; పదండి ముందుకు, పదండి త్రోసుకు! పదండి పోదాం, పైపైకి! బ్లేడుల్ గడ్డాల్, అడ్డాల్‌లేవి, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది!'...

'...అయ్యనాయనోయ్! నీళ్లు చల్లారి పోతున్నాయని శ్రీమతి కేకలేస్తోంది!'

'వస్తున్నా! వస్తున్నా శ్రీమతీ, నా మతి మండిపోయింది!'

.. ఔనౌను! అందుకే గడ్డపు కవిత్వం అల్లుకుంటూ...జోహ్! ఏం ప్రయోగమండి! కవిత్వం

అల్లుకోవడంటు, జడ అల్లుకోవటంలా!...ఇంకా నయం నులకమంచం అల్లటంలా కాదూ?...కాదేమిటి లెద్దూ! కొందరి కవిత్వం అంతకంటె అధ్వాన్నంగా అల్లబడటం లేదూ? ఈ మధ్యన పేరు పొందిన సినీ మహాకవుల్ని చూడరాదూ? డబ్బుబాగా దొరుకుతుంది కనుక సినిమా పాటలు బాగా రాస్తారు ప్రత్యేక సంచికలకోసం కవిత్వాన్ని అల్లి కొండొకచో (మాటలు) పేర్చి పత్రికలవాళ్ల మొహాన్ని ఆ తరువాత సాహితీ పిపాసుల మొహాన్ని కొడతారు! నులక మంచం అల్లటం ఎంత కష్టమైనపని దీనితో పోలిస్తే!.. పాపం!...వాళ్లు మటుక్కేం చేస్తారు?' 'పిండికొద్దీ రొట్టె డబ్బుకొద్దీ కవిత్వం!' పేరొచ్చే వరకు పత్రికలలో శ్రమించి వ్రాయి! పేరొచ్చి సినిమాల్లో చేరాక పత్రికలవాళ్లు చంపుకుతింటే కవిత్వం అల్లెయ్యి! సినిమా మహాకవిని పండుగనాడు నంజుకు తింటాం, అర్థంకాని ఆ కవిత్వం ప్లస్ అర్థంకాని ఆ బొమ్మల్ని! అక్షరలక్షలిచ్చిన అభాగ్యుల్ని తలుచుకుంటే ఏడుపొస్తోంది! 'శ్రీ కృష్ణదేవరాయా! నువ్వే బ్రతికివుంటే చచ్చి పోయివుందువు కదా ఈనాటి సాహిత్య పరిస్థితికి'

...ఊ! ఊ! నడవ్వయ్యా రావూరావ్! కవిత్వం అల్లటంలోంచి మాటలు పేర్చటంలో పడ్డావ్!' అల్లి...అల్లి...మనం ఎప్పటికేనా అల్లసాని పెద్దన్న అంత పెద్ద కవి మవగలమా? పెద్దన్న అంతపెద్ద కవిని కాకపోయినా, చిన్నయ్య అంత చిన్న వ్యాకరణం రాస్తే బావుండును; ఇంతచిన్న వ్యాకరణ దీపపు కాంతిని విస్తరింపచేయుటకు ఎంతపెద్ద వ్యాఖ్యానాలు! గూఢార్థ ప్రకాశదీపికలు! రమణీయమైన ఘంటాపథ పుస్తకాలు! అహో చిన్నయగారూ అందుకోండి నా కంగ్రాచ్యులేషన్స్! ... పోదామా ఇక పోదామా? స్నానాలగదిలోకి పోదామా! మాటలు పాటలు నాటికలు...ఛఛ ఆటలు పాటలు నాటికలూ...

(సశేషం)

